క్లుప్తంగా

కండే మంగమ్మకు బాలినేని నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలినేని

ఒంగోలు సెంట్రల్: పీడీసీసీబీ మాజీ చైర్మన్ కండె శ్రీనివాసరావు మాతృమూర్తి మంగమ్మ సంస్మరణ సభకు ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి బుధవారం హాజరై ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. మేయర్ గంగాడ సుజాత, యువనాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి, మంత్రి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు అంబటి ప్రసాద్, నరసయ్య, సెంట్రల్ బోర్డు మాజీ నంబర్ రత్నరాజు, కట్ట గోపి, ఎడవెల్లి సాంబయ్య, పీడీసీసీబీ సీఈఓ ప్రకాశ్, పలు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా భగిని హస్త భోజనం

ఒంగోలు మెట్రో: భగిని హస్త భోజనం వేడుకను బుధవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. స్థానిక గాంధీరోడ్డులోని గీతా మందిర భక్త బృందం అమలనాథునివారివీధిలో కొలువై ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరిదేవికి చీర సారే, పసుపు కుంకుమ, గాజులు, పండ్లను సమర్పించారు. ముందుగా గీతా మందిరంలో శ్రీకృష్ణ పరమాత్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి గీత శ్లోకాలను పఠించారు. అన్నా చెల్లెల పండుగను ఘనంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారికి అష్టోత్తర సహస్రనామార్చన, మంత్రపుష్పం, మహాహారతి సమర్పించారు. భక్తులు సామూహికంగా విష్ణు సహస్రనామ స్తోత్రం, లలితా సహస్రనామ స్తోత్రాలను పఠించారు.

రైతు భరోసా కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు



రైతులకు శనగలు అందిస్తున్న వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

నాగులుప్పలపాడు: రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పోతవరం గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించిన ఆయన.. అక్కడి రైతులతో పంటలపై చర్చించారు. అనంతరం ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న శనగలను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ఒంగోలు డివిజన్ సహాయ సంచాలకులు రమేష్‌బాబు, వ్యవసాయాధికారి వెంకట్రావు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై ప్రత్యేక దృష్టి

- 23న అధికారులతో సమీక్ష సమావేశం
- ప్రతి ఒక్కరి సమస్యలు పరిష్కారం
- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

కొత్తపట్నం: మండలంలో ఉన్న వివిధ రకాల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేస్తానని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం కొత్తపట్నంలో రూ.2.75 కోట్లతో డబుల్ రోడ్డుకు శంకుస్థాపన చేసిన అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో బాలినేని మాట్లాడారు. మండలంలో ఏ వ్యక్తి కూడా నాకు ఫలానా సమస్య ఉందని చెప్పకూడదని అన్నారు. అన్ని సమస్యలు పరిష్కరించడానికి ఈ నెల 23న అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. ఆ రోజు సమస్యలన్నింటిపై అధికారులతో చర్చించి పరిష్కరించనున్నట్లు చెప్పారు. భూ సమస్యలు, సీసీ రోడ్లు, శ్మశానాలు, వివిధ రకాల సమస్యలన్నీ పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఆ ఒక్క రోజు కాకపోతే మరుసటి రోజు కూడా ఉండి సమస్యలు పరిష్కరిస్తానని చెప్పారు. ఇప్పటికే మండలంలో సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్లు, జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే బాలినేని వివరించారు. 32 డ్వాక్రా గ్రూపుల సభ్యులకు కెనరా బ్యాంక్ నుంచి మంజూరైన రుణాలకు సంబంధించి రూ.3.10 కోట్ల చెక్కును బాలినేని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, జిల్లా అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, కెనరా బ్యాంక్ మేనేజర్ సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ బీవీ రమణారావు, మాజీ ఎంపీపీ వాయల మోహన్‌రావు, పిచ్చిరెడ్డి, గొర్రెపాటి శ్రీను, ఏపీఎం షేక్ రజియా సుల్తాన్ బేగం తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగనే సీఎం కావాలి



అల్లూరులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న సూర్యనారాయణ, నాయకులు



వెల్లంపల్లిలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, మండల కన్వీనర్

అల్లూరు (కొత్తపట్నం): పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేసి వారు ఆర్థికంగా ఎదగడానికి కారకుడైన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని అల్లూరు ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు అన్నారు. అల్లూరు గ్రామ సచివాలయం-2లో ఈవోఆర్డీ, ప్రోగ్రాం నోడల్ అధికారి ఏ బాలచెన్నయ్య ఆధ్వర్యంలో సర్పంచ్ నంబూరి సూర్యనారాయణ అధ్యక్షతన బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతారావు మాట్లాడుతూ అల్లూరు గ్రామ సచివాలయం-2 పరిధిలో రూ.29.76 కోట్లతో అభివృద్ధి పథకాలు అమలు చేశారని చెప్పారు. సూర్యనారాయణ చేతుల మీదుగా సంక్షేమ పథకాల బోర్డును రిబ్బన్ కట్ చేసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వీరేపల్లి రామచంద్రారెడ్డి, కో ఆప్షన్ మెంబర్ బాజీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెల్లంపల్లిలో...

మద్దిపాడు: జగనన్నే ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రి కావాలని ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వెల్లంపల్లి గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ పాఠశాలల్లో చదువుతున్న పిల్లల మొదలు అవ్వాతాతల వరకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత జగన్‌కు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మండవ అప్పారావు, జేసీఎస్ కన్వీనర్ బత్తుల శ్రీనివాసరావు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గుడ్డపాతల రవి, తేళ్ల పుల్లారావు, రాయపాటి రమేష్, పిట్టల ఆంజనేయులు, సర్పంచ్‌లు కోటిరెడ్డి సుబ్బారెడ్డి, ఎంపీటీసీ పైనం ప్రభాకర్, గ్రామ నాయకులు పిచ్చిరాజు, జయమ్మ కృష్ణారెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం...

నాగులుప్పలపాడు: రాష్ట్రంలో అన్ని రంగాల్లో అభివృద్ధి కొనసాగాలంటే ముఖ్యమంత్రిగా జగనే ఉండాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం చీర్వానుప్పలపాడు గ్రామ సచివాలయంలో సంక్షేమ పథకాలు, లబ్ధిదారుల బోర్డులను ఆవిష్కరించారు. అనంతరం గ్రామ కూడలిలో పార్టీ జెండా ఎగురవేసి ఇంటింటికి సంక్షేమ పథకాలు అందిన తీరును వివరించారు. గ్రామస్తులతో రాత్రి బస చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, సచివాలయ కన్వీనర్లు నాగరాజు, ఎంపీడీవో జయమణి, ఈవోఆర్డీ వేణుకుమారి పాల్గొన్నారు.

పీ నాయుడుపాలెంలో...

చీమకుర్తి: పి.నాయుడుపాలెంలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, పార్టీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు ముఖ్య అతథులుగా పాల్గొన్నారు. గడిచిన నాలుగున్నరేళ్లలో నాయుడుపాలెంలో రూ.30 కోట్ల విలువ చేసే అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బొంతా కరుణప్రియ సంతోష్, ఎంపీటీసీ సభ్యురాలు కూడలి అంజలి మాలకొండయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సంతనూతలపాడు మండలం మంగమూరులో...

మంగమూరులో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ బీ విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ పాల్గొన్నారు. గ్రామంలో రూ.23 కోట్ల నగదును లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్కే అల్లీ సాహెబ్, అబ్బూరి శంకర్‌రావు, పీ వెంకారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

350 మందికి ఉచిత వైద్య పరీక్షలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్లు

ఒంగోలు టౌన్: నగరంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో గల ఆలూరి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో బుధవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో 350 మందికి పరీక్షలు చేసినట్లు ఎండీ డాక్టర్ రమా తెలిపారు. ప్రముఖ న్యూరోసర్జన్ డాక్టర్ ఎ.వి.సుందరరావు వైద్య శిబిరాన్ని ప్రారంభించగా, డాక్టర్లు రవి, వెంకట్, అనసూయ, సాయినాథ్ పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో పాల్గొన్నవారికి డాక్టర్ మన్నం శింగయ్య మెమోరియల్ ట్రస్ట్ తరపున ఉచితంగా హెల్త్ కార్డులు ఇచ్చినట్లు డాక్టర్ రమా తెలిపారు.

సర్వ మాలధారణ భక్తులకు నిత్య అన్నదానం



అన్నదానం చేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: సర్వ మాలధారణ భక్తులకు బూచేపల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం చీమకుర్తిలోని బూచేపల్లి కల్యాణ మండపంలో నిత్య అన్నదానంను జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ప్రారంభించారు. అయ్యప్పస్వామి భక్తులతో పాటు భవాని, శ్రీవెంకటేశ్వర, శివమాలలు ధరించిన భక్తులందరికీ వారి మాలధారణ కాలం పూర్తయ్యే వరకు కల్యాణ మండపంలో అన్నదానం చేయనున్నట్లు వారు వెల్లడించారు. తొలుత అయ్యప్పస్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వయంగా భోజనాన్ని వడ్డించారు. కార్యక్రమంలో మాలధారులతో పాటు వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది నిర్లక్ష్యం వదిలి పనిచేయాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ దినేష్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లోని స్పందన భవనంలో సంతనూతలపాడు నియోజకవర్గ బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ క్లైయిమ్‌లు అన్నీ ఈ నెలాఖారులోపు కచ్చితంగా క్లియర్ చేయాలన్నారు. రోజువారీ నివేదిక అందజేయాలని ఆదేశించారు. ఎటువంటి లోపాలు లేకుండా పారదర్శకమైన ఓటరు జాబితా తయారు చేయాలన్నారు. ఓట్ల తొలగింపు విషయంలో బీఎల్‌వోలు కచ్చితమైన నిబంధనల మేరకు వ్యవహరించాలన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఈపీ నిష్పత్తి జండర్ నిష్పత్తిని బేరీజు వేసుకోవాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన విధుల్లో వలంటీర్లను ఎట్టి పరిస్థితుల్లో భాగస్వాములను చేయవద్దని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వరకుమార్, నియోజకవర్గ తహసీల్దార్లు పాల్గొన్నారు.

రైతు చరిత్రకు దర్పణం.. మట్టిబండి

ఒంగోలు మెట్రో: డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ రచించిన మట్టిబండి దీర్ఘ కవిత రైతుల వర్తమాన చరిత్రకు నిలువుటద్దమని పలువురు వక్తలు పేర్కొన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి జిల్లా కేంద్ర గ్రంథాలయ ఆవరణలో డాక్టర్ నాగభైరవ సాహిత్య పీఠం ఆధ్వర్యంలో మట్టిబండి పుస్తకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి, ఉపగ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి, ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు వేంకట శ్రీనివాసులు, గుంటూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సహాయ ఆచార్యులు డాక్టర్ డి.ధాత్రీకుమారి, కవి, రచయిత నెమ్మాని సీతారామమూర్తి, తేళ్ల అరుణ, జ్యోతిర్మయి, సూర్యకుమారి, యు.వి.రత్నం తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు కుటుంబాలకు అండగా ఉంటాం

నాగులుప్పలపాడు: నిరంతరం ప్రజా సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించడంలో ముందుండే జర్నలిస్టుల కుటుంబాలకు తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి అండగా ఉంటామని ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ స్టేట్ స్పెషల్ ఆఫీసర్ యాదల అశోక్‌బాబు, జెడ్పీటీసీ యాదల రత్నభారతి అన్నారు. జర్నలిస్టు కోనూరి వేణు తండ్రి కోనూరి రాఘవరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బుధవారం కొత్తకోటలోని వేణు కుటుంబాన్ని వారు పరామర్శించారు. జర్నలిస్టు సంఘ సంతనూతలపాడు నియోజకవర్గ అధ్యక్షుడు ఉప్పుటూరి రాజశేఖర్, గ్రామ సర్పంచ్ చిన్నం సుజాత సురేష్, లిడ్ క్యాప్ స్టేట్ డైరెక్టర్ కంచర్ల సుధాకర్, నాయకులు కాట్రగడ్డ శ్రీనివాసరావు, మద్దిసాని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు కృషి



నాసా ప్రాజెక్టుకు ఎంపికైన విద్యార్థులతో అతిథులు, స్కూల్ ప్రతినిధులు

ఒంగోలు సెంట్రల్: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రత్యేక కార్యక్రమాల ద్వారా కృషి చేస్తున్నట్లు స్థానిక భాగ్యనగర్‌లోని శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ హర్షవర్ధన్ తెలిపారు. స్కూల్ నుంచి నాసా ప్రాజెక్టుకు ఎంపికైన 25 మంది విద్యార్థులకు బుధవారం కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైజ్ కృష్ణసాయి ప్రకాశం గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్ ప్రొఫెసర్ డాక్టర్ గడిరాజు వెంకట భాస్కరరావు, ఆర్ఐ అనిల్‌కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. శాస్త్ర సాంకేతిక రంగం ప్రాముఖ్యత, అందులో విద్యార్థులు విజయం సాధించడానికి చేయాల్సిన కృషిని వివరించారు. కార్యక్రమంలో డీన్ శివరామ్, నాసా ప్రాజెక్టు ఇన్‌చార్జి బోయజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తక పఠనం అవసరం

నాగులుప్పలపాడు: విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనం చాలా అవసరమని సామాజిక సేవా కార్యకర్త తెలగతోటి శ్యామ్యూల్ అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఉప్పుగుండూరు శాఖా గ్రంథాలయంలో 2వ రోజు పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు గ్రంథాలయంలో లభించే పుస్తకాల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ ఉపాధ్యక్షుడు కొంజేటి సురేష్‌బాబు, ఆక్స్‌ఫర్డ్ పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు, గ్రంథపాలకుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ వర్ధంతి సభ బ్రోచర్ ఆవిష్కరించిన కలెక్టర్



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: మాదిగ సంక్షేమ పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సభ బ్రోచర్‌ను కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ బుధవారం ఆవిష్కరించారు. మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సృజన్ మాదిగ ఆధ్వర్యంలో ఇతర సభ్యులు పాల్గొన్నారు. డిసెంబర్ 6వ తేదీ జరిగే ఈ కార్యక్రమానికి కలెక్టర్‌ను ఆహ్వానించారు. ఆ రోజు చేపట్టే సేవా కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర డప్పు చర్మకారుల సంఘ అధ్యక్షుడు ఆంజనేయులు, కళల దండోరా ప్రసాద్, శాంతన స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ జయకుమార్, ఎంఎస్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

దిశ యాప్‌తో ఎంతో అండ



దిశ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు మొబైల్స్ చూపుతున్న విద్యార్థులతో పోలీసులు

ఒంగోలు: దిశ యాప్ ఉంటే ఎంతో అండ ఉన్నట్లేనని దిశ పీఎస్ డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం దిశ యాప్ గురించి ముఖ్యమైన సమాచారాన్ని విద్యార్థులకు వివరించారు. దిశ యాప్‌లో ఏమేం రకాలున్నాయి, వాటిని ఎలా వినియోగించుకోవాలి, అందుకు చేయాల్సిన పని ఏమిటనే దానిపై విద్యార్థులకు ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో యాప్ డౌన్‌లోడ్ చేయించి రిజిస్ట్రేషన్ చేయించారు. ఆపదలో ఉన్నప్పుడు ఆదుకునేవారికోసం యత్నిస్తుంటామని, కానీ మొబైల్ ఉండి అందులో దిశ యాప్ ఉంటే ఆపన్నహస్తం మీ చెంత ఉన్నట్లేనని వివరించారు. మాట్లాడేందుకు అవకాశం లేనివారు మొబైల్‌ను గట్టిగా ఐదుసార్లు ఊపినా చాలని, వెంటనే రెస్క్యూటీమ్ మీరు ఉన్న ప్లేస్‌కు చేరుకుని కాపాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పేస్ కాలేజీ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, దిశ పీఎస్ ఏఎస్సై గౌతమి, హెచ్‌సీ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పశు ఆరోగ్య సంరక్షణ కార్డులు పంపిణీ



త్రోవగుంటలో కార్డులు అందజేస్తున్న జేడీ బేబీరాణి

మద్దిపాడు: పశు ఆరోగ్య సంరక్షణ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మద్దిపాడులోని బుధవారం ప్రారంభించారు. పశు సంవర్ధకశాఖ డీడీ ఎ.రమేష్ పాల్గొని మాట్లాడుతూ ఈ కార్డుల వలన పాడి రైతులకు మేలు చేకూరుతుందని తెలిపారు. మద్దిపాడు సమీపంలో ఏర్పాటు చేసిన ఫారంను ఆయన సందర్శించి అక్కడి పాడి రైతులకు పశు ఆరోగ్య సంరక్షణ కార్డులు అందించారు. కార్యక్రమంలో మద్దిపాడు ఏడీ సుగణ్యరావు, పశువైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

త్రోవగుంటలో పాల్గొన్న జేడీ బేబీరాణి...

ఒంగోలు రూరల్: త్రోవగుంటలోని పశుసంవర్ధకశాఖ ఏడీఏ కార్యాలయంలో జేడీ బేబీరాణి పాల్గొని రైతులనుద్దేశించి మాట్లాడారు. పశుపోషకులు, పశుసంపద వివరాలను, ఆరోగ్య కార్డుల ద్వారా పశుపోషక సిబ్బంది, వైద్యులు ఆన్‌లైన్ చేస్తారని తెలిపారు. కార్డులో చెవిపోగు సంఖ్య, ఆరోగ్య పరిరక్షణ చర్యలు, పునరుత్పత్తి వివరాలు, వ్యాధి నిరోధక టీకాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ భనవశంకరరావు, ఒంగోలు మండల పశువైద్యాధికారి భూపాల్‌రెడ్డి, ఏడీ చంద్రమోహన్, పశువైద్యాధికారి వెంకటరామిరెడ్డి, లైవ్‌స్టాక్ ఆఫీసర్ కె.లక్ష్మయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆవులు, గేదెలను సొంత స్థలాల్లో కట్టేసుకోవాలి

ఒంగోలు సబర్బన్: నగరంలో ఆవులు, గేదెలు, దూడలను వాటి యజమానులు వారి సొంత స్థలాల్లో కట్టేసుకోవాలని కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు బుధవారం ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ చేశారు. వాహనదారులకు, ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా ఆవులు, గేదెలు, దూడలు మారాయని పేర్కొన్నారు. వారంలో వాటిని పట్టుకొని ఒంగోలు నగరంలోని 17వ డివిజన్ ప్రగతి కాలనీలో ఉన్న బందెల దొడ్డికి తరలిస్తామని తెలిపారు. అలాంటి పశువుల యజమానుల నుంచి ఒక్కో ఆవు, ఎద్దు, గేదెకు రోజుకు రూ.250 చొప్పున అపరాధ రుసుం వసూలు చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా ఒక్కో దూడకు రూ.150 చొప్పున అపరాధ రుసుం వసూలు చేస్తామని స్పష్టం చేశారు.

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యకరం



ఏటీఎం మోడల్ తయారు చేస్తున్న రాధా, సుభాషిణి

ఒంగోలు రూరల్: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలు ఆరోగ్యకరమని రైతు సాధికార సంస్థ ఏపీ డీపీఎం వి.సుభాషిణి అన్నారు. కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ డీపీఎం ఆదేశాల మేరకు బుధవారం బొద్దులూరివారిపాలెంలో ఏటీఎం మోడల్‌ను రాధా శింగమనేని తయారు చేశారు. కేవలం 20 సెంట్ల విస్తీర్ణంలో ఏడాది పొడవునా సీజన్లతో పనిలేకుండా 15 నుంచి 30 వరకు ఆకుకూరలు, కూరగాయలు లభిస్తాయని డీపీఎం తెలిపారు.